విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 20 అక్టోబరు 2024

నీటి సంఘాల ఎన్నికలు

అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నిర్ణయించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో గోదావరి, ఏలేరు, పంప, సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు కింద ఇప్పటికే నీటి సంఘాలు ఉన్నాయని, దీనికి సంబంధించి ప్రాదేశిక నియోజకవర్గం వారీగా అడంగల్ అనుసరించి రైతులు వివరాల జాబితా సిద్ధం చేయాలన్నారు. తూర్పు ఆయకట్టు కింద నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాదేశిక

మిగతా 2లో..

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఐ.జి. అశోక్ కుమార్

విశాలాంధ్ర-నరసాపురం: ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్ళ చేతిలో ప్రజలు మోసపోతున్నారని అటువంటి ఘటనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఐజి అశోక్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక డి.ఎస్.పి. కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ అధికారులు అంటూ ఫేక్ కాల్స్ చేసి సైబర్ నేరగాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోయిన బాధితుల కోసం టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగదు కోల్పోయిన బాధితులు సమాచారాన్ని పోలీసులకు మూడు గంటలలో అందిస్తే ఆ నగదును బ్లాక్ చేయొచ్చని చెప్పారు. నగదును కోర్టు ద్వారా బాధితులు రాబట్టుకోవచ్చన్నారు. ఈ విషయం తెలియక ప్రజలు నష్టపోతున్నారని,సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించ

నున్నట్టు తెలిపారు. అతివేగం నియంత్రణకు రోడ్డు ప్రమాదాలు నివారణకు తగు చర్యలు తీసు కుంటున్నామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని గంజాయి, కొకైన్,వంటి డ్రగ్స్ సరఫరా చేసే ముఠాపై పటిష్ట నిఘా పెట్టామన్నారు. గంజాయి ముఠా వివరాలు తమ వద్ద ఉన్నాయని ఉక్కుపాదం మోపి గంజాయి సరఫరా నివారిస్తామన్నారు.గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వీరిలో మంచివారు కూడా ఉన్నారన్నారు. చెడ్డవారి చేతిలో మోసపోయిన బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అమరవీరులకు శ్రద్ధాంజలి

నక్సలైట్ల చేతులు ప్రాణాలు కోల్పోయిన పోలీసు లకు ఐజి అశోక్ కుమార్ శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసుల అమరవీరుల దినోత్సవంను ఘనంగా నిర్వహించి అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు.

జిల్లాలో నలుగురు పోలీసు అధికారులు, గ్రేహౌండ్స్ నుంచి ఇద్దరు నక్సలైట్స్ చేతిలో అమరులయ్యారన్నారు. పోలీసుల అమరవీరుల దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పోలీస్ విధులు, పనితీరుపై అవగాహన సదస్సు రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు.

పట్టణాలకు ధీటుగా పల్లెల అభివృద్ధి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

విశాలాంధ్ర -పోడూరు : పట్టణాలకు ధీటుగా పల్లె సీమలను అభివృద్ధి చేస్తామని గ్రామ స్వరాజ్యం ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల సందర్భంగా పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో రెండు సిసి రోడ్లకు, డ్రైన్‌కు, మట్టపర్రు గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణాలకు శనివారం మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పూజ్య బాపూజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం ఎన్డీఏ

ప్రభుత్వంతో సాధ్యమవుతుందని, రానున్న కాలంలో గ్రామసీమలు రూపు రేఖలు మారబోతున్నాయని అన్నారు.కేవలం ఏడు రోజుల్లో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో భాగంగా రూ 4500 కోట్లతో 30 వేల పనులు శ్రీకారం చరిత్రాత్మకం అన్నారు. గ్రామ గ్రామాన ఇంటింటికి 3 వేల కిలోమీటర్ల సిసి రహదారులు నిర్మాణాలు వేగవంతం చేసి సంక్రాంతి లోపుగా పూర్తి చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక హెక్టరుకు ఇన్పుట్ సబ్సిడీ రూ. 25 వేలు పెంచామన్నారు.డీఎస్సీ ద్వారా 16,500 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. గ్రామాల్లో త్రాగునీటికి, రహదారులకు, మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి గ్రామాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, యంపిపి సబ్బితి సుమంగళి, గ్రామ సర్పంచులు జమ్ము బేబీ

మిగతా 2లో..

చదువులెలా...!

- రెడ్డిగూడెం తోగు పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- అంగన్‌వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - కుక్కునూరు: ఏలూరు జిల్లా మారుమూల మండలం కుక్కునూరు ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు.మండలంలోని రెడ్డిగూడెంతోగు గుంపులో శనివారం శాఖా కార్యదర్శి సోడే రమేష్ అధ్యక్షతన శాఖా సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ గుంపు పిల్లలు అక్షరాలు దిద్దడానికి ఎటువంటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నా రని తెలిపారు. సుమారు 20 మంది పిల్లలున్నారని చదుకోవడానికి కనీసం అంగన్ వాడి కేంద్రం కూడా లేదని విమర్శించారు.పిల్లలకు 5 ఏళ్లు వచ్చినా బడి ఎలా ఉంటుందో తెలియదని ఇక పలక,బలపం ఎరగరని ఆవేదన వ్యక్తం చేశారు.బడికి వెళ్లాలంటే వాగు..రాళ్లు.. రప్పలు దాటుతూ చేరుకోవాలని,రహదారి సౌకర్యం లేక

మిగతా 2లో..

ఉచిత ఇసుకకు సాంకేతిక ఇబ్బందులు తొలగించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: ఉచిత ఇసుక పొందడానికి సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి టెక్నికల్ సిబ్బందిని ఆదేశించారు. శని వారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా కాల్ సెంటర్ టెక్నికల్ సిబ్బందితో సమావేశమై ఉచిత ఇసుక సాంకేతిక సమస్యలపై సమీక్షించారు. ఈ

సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వినియోగ దారుని అవసరాలకు ఉచిత ఇసుకను తక్కువ రవాణాచార్జీలతో అందజేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. కాల్ సెంటర్ కు వచ్చిన కాల్స్‌ను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సాంకేతిక లోపాలు ఏమైనా ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయాలను రాష్ట్రస్థాయి టెక్నికల్ టీం తో సంప్రదించి పరిష్కరించ డానికి కృషి చేస్తామన్నారు. ఉచిత

మిగతా 2లో..

అస్తవ్యస్తంగా కూటమి పాలన

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-తణుకు: కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉందని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక దుర్భర దారిద్య పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఇసుక కోసం స్లాట్ బుక్ చేసుకుందామంటే నో స్టాక్ అని వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వెబ్ సైట్లో ఒక ప్రక్క ఉన్నదని చూపిస్తోంది , నెక్స్ట్ స్టెప్ కు వెళితే నో సాన్డ్ అని వస్తుందని మండిపడ్డారు. నూతన మద్యం విధానం పేరుతో ఆర్భాటంగా ఏర్పాటుచేసిన మద్యం షాపులలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారని విమర్శించారు. గోదావరి జిల్లాలలో కొన్ని షాప్ లు దక్కించుకున్న ఇతరులను స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోకుండా కూటమి నాయకులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే ఈ రెండు పథకాలను పర్యవేక్షించి, ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చేయాలన్నారు. మద్యం అమ్మకాలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

విశాలాంధ్ర - నిడమర్రు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్డిఏ కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం నిడమర్రు మండలంలో తోకలపల్లి ఆముదాల పల్లి బైనేపల్లి దేవరగోపవరం పెదనిండ్రకొలను గ్రామాల్లో సిసి రోడ్లు తదితర పనుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలఅభివృద్ధి,పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టత ధ్యేయంగా గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యం సాధనకు ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన టిడిపి బిజెపి మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికారులు, వీర మహిళలు, తెలుగు మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

విశాలాంధ్ర - కుక్కునూరు: ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కుక్కునూరు ఎస్.ఐ. రామకృష్ణ అన్నారు.ఆటో ప్రమా దాల నివారణ, నిబంధనలపై శనివారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ

సందర్భంగా ఎస్.ఐ. మాట్లా డుతూ వాహనం నడిపే వ్యక్తి విధిగా డ్రైవింగ్ లైసెన్స్, సంబంధిత ధ్రువ పత్రాలు కలిగి ఉండాలన్నారు.కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ లను తప్పనిసరిగా ధరించాల న్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా వారితో పాటు ఇతరుల జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు.ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి నాగేంద్రరావు, యర్రం సాయికిరణ్,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి

1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని వేలేరు గ్రామ శివార్లలో గుట్టుగా తయారీ చేస్తున్న సారా స్థావరాలపై శనివారం కుక్కునూరు సీఐ రమేష్ బాబు సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు.సుమారు 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా సీఐ రమేష్ బాబు మాట్లాడుతూ నాటుసారాపై ఉక్కుపాదం మోపామని, సారా అమ్మినా, తయారు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

పెండింగు కేసుల పరిష్కారానికి తక్షణ చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: జిల్లాలోని వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న కోర్ట్ కేసులకు సంబంధించి పరిష్కారానికి ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. లోకాయుక్త, జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హై కోర్ట్, తదితర కోర్ట్ ల అందిన కేసులపై జిల్లా అధికారులు, ఆర్డీఓ లు, తహసీల్దార్లు తో కలెక్టర్ శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ లోకాయుక్త, జాతీయ,రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, హై కోర్ట్, తదితర కోర్ట్ ల నుండి అందిన కేసులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అంశాలపై సిబ్బందితో సమీక్షించుకోవాలన్నారు.రిట్ పిటీషన్స్ లో కోర్ట్ లు ఇచ్చిన ఆదేశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కోర్ట్ ధిక్కరణ నమోదు అయ్యే అవకాశం ఉంటుందన్నారు.అటువంటి పరిస్థితి రాకుండా అధికారులు ముందుగానే తీసుకున్న చర్యలపై నివేదికను సదరు కోర్ట్ కు సమర్పించాలన్నారు.

కోర్ట్ ధిక్కరణ కేసుల్లో ఎటువంటి జాప్యం లేకుండా వకాల్తా సమర్పించాలన్నారు. కోర్ట్ కేసుల పెండింగ్ అంశాలపై ప్రతీ శనివారం సమీక్షించడం జరుగుతుందని, అందుకు తగిన విధంగా సంబంధిత కేసుల పూర్వాపరాలపై పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఆర్డీఓ లు కె. అద్దయ్య , అచ్యుత అంబరీష్, వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ప్రభృతులు జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

తొలగించాలి

(1వ పేజీ తరువాయి)

ఇసుక అవసరమైన లబ్ధిదారులు వెబ్సైట్ నందు స్వయంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కొంతమంది మధ్యవర్తులు, మీసేవ సెంటర్లు ఆన్లైన్ బుకింగ్ పేరిట పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి ఫిర్యాదులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కాల్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 93914 45753, 86882 91997, 81869 39223, 95501 75144 నందు సంప్రదించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి కె.వెంకటేశ్వర్లు, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ మేక కిరణ్ కుమార్, కాల్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి

(1వ పేజీ తరువాయి)

డా.కె.సి.హెచ్.అప్పారావు, తహశీల్దారు యస్.యం. ఫాజిల్, యంపిడివో బి.మంగా కుమారి,సిడిపివో సి.హెచ్. ఇందిర, వివిధ శాఖలు అధికారులు, యంపిటిసి సభ్యులు భూపతి రాజు సరస్వతి, విప్పర్తి శారద , నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, భూపతి రాజు సత్యనారాయణ రాజు, పాలవలస తులసీ రావు, కోడి విజయ భాస్కర్, కర్నేని గౌరు నాయుడు, దేవరపు దొరబాబు, కుక్కల సత్యనారాయణ,పితాని వెంకట్, గ్రామ సచివాలయ సిబ్బంది, టిడిపి,జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

చదువులెలా..!

(1వ పేజీ తరువాయి)

నానా తిప్పలు పడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అడవి బిడ్డలను అడిగి అడిగి మరీ ఓటు వేయించుకున్న పాలకులు సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నా రని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ నిధుల ద్వారా ఆదివాసీ గ్రామాల్ని అభివృద్ధి చేసి పిల్లలకు అంగన్ వాడి, బడులను ఏర్పాటు చేసి పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్య అందించి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జంగారెడ్డి గూడెం మండల కార్యదర్శి రమణరాజు, జిల్లా సమితి సభ్యులు కురాకుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు

(1వ పేజీ తరువాయి)

నియోజకవర్గం పరిధి నిర్ణయించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు మండల స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి డా డి తిప్పేనాయక్, ఇరిగేషన్ ఎస్ఈ జీ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరిరావు, కాకినాడ, పెద్దాపురం డీఈ ఎం రవి, కాకినాడ, ఆర్ పోచారావు, పుష్కర కెనాల్ ఈఈ రాజేశ్వరరావు, శ్రీనివాసు ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాలనాటి సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర-లింగపాలెం: కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఆసన్నగూడెం నుంచి బాదరాల వెళ్లే రహదారిని పునర్ నిర్మిస్తున్నారు. ఈ

మార్గం లింగపాలెం,కే.కోట మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఏలూరు,ఇతర దూర ప్రాంతాలు వెళ్లేందుకు ఉపయోగ పడుతుంది.రైతులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు,పండిన పంటను తెచ్చుకునేందుకు ఈ ప్రాంత ప్రజలకు ఇదే ప్రధాన రహదారిగా ఉంది.దాదాపు నాలుగు కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రహదారి ఎప్పుడూ మరమ్మతుకు గురవుతూనే ఉంటుంది.దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లటానికి వీలులేని పరిస్థితి ఈ మార్గంలో నెలకొంది. ఈ మార్గాన్ని పక్కాగా నిర్మించాలని కోరుతూనే ఉన్నా దీనిపై ఎటువంటి చర్యలు గత ప్రభుత్వంలో తీసుకోలేదు. కూటమిప్రభుత్వం అధికారంలోకి రావడం,ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఈ రహదారి మరమ్మతుకు శ్రద్ధ చూపి ఎన్.ఆర్.జి.ఎస్ నిధుల నుంచి నాలుగు కిలోమీటర్ల మేర సిమెంట్ రహదారి నిర్మించేందుకు రూ2 కోట్లు మంజూరు చేయించారు.ఈ నిధులతో పనులు చేపట్టారు.ఎన్నో ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపటంతో కూటమి ప్రభుత్వాన్ని,ఎమ్మెల్యే రోషన్ కుమార్ను ఈప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.

డిఎన్నార్ సహాయ కార్యదర్శి

శివరామరాజు మృతి

విశాలాంధ్ర -భీమవరం: శివరామరాజు డి.యన్.ఆర్ విద్యా సంస్థల అభివృద్ధిలో నిరంతరం శ్రమించా రని పాలకవర్గ అధ్య క్షులు గోకరాజు వెంకట నరసింహ రాజు, సెక్రటరీ కరస్పాండెంట్ గాదిరాజు బాబు నివాళులు అర్పించారు. డి.యన్.ఆర్ విద్యా సంస్థల సహాయ కార్యదర్శి కె.శివరామరాజు శనివారం మృతి చెందారు. ఈ సంద ర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ అసోసియేషన్ పాలవర్గ సభ్యునిగా, అసిస్టెంట్ సెక్రటరీగా నిస్వార్థ సేవలు అందించారని అన్నారు. సంతాప సభలో పాలక వర్గ ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు, సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు పి.రామకృష్ణం రాజు, ఎ.సురేంద్ర, విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు నివాళులు అర్పించారు.

దీపావళి వ్యాపారాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - కైకలూరు : రానున్న దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణ దారులు పెట్టుకునే వ్యాపారులు తప్పనిసరిగా జిల్లా ఆర్డీఓ కార్యాల యంలో దరఖాస్తు చేసుకుని అనుమతి

పొందాలని కైకలూరు రూరల్,టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు వి.రవికుమార్, కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాణా సంచా దుకాణాలలో వ్యాపారులు నియమనిబంధనలు పాటించాలని సూచించారు.పోలీసు,పంచాయతీ, రెవిన్యూ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.ఎక్కడైనా అనుమతులు లేకుండా అనధికారంగా నిల్వలు వున్నట్టు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇప్పటి వరకు కైకలూరు లో 12 షాపులు కు అప్లికేశన్లు వచ్చాయన్నారు. ప్రజలు దీపావళి పండుగను జరుపుకునేటప్పుడు తగు జాగ్రతలు పాంచాలని అన్నారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

సమ్మెను ఉధృతం చేస్తాం -ఏఐటీయూసీ

విశాలాంధ్ర -భీమవరం: క్లాప్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పాలకులు పెడచెవిన పెడుతున్నారని, సమ్మెను మరింత ఉధృ తం చేస్తామని ఏఐటి యుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు అన్నారు. తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత పదకొండు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్స్ ఏఐటీయూసీఅధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ గత మూడు నెలల నుండి క్లాప్ డ్రైవర్స్ కు జీతాలు ఇవ్వడం లేదని, పి.ఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని, కనీస వేతనం రూ 18.500 ఇవ్వాలని, క్లీన్ అండ్ గ్రీన్ వాహనాల మరమత్తులను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమీషనర్ లను కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ క్లాప్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడామని, సోమవారం స్పష్టత వస్తుందని ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని విధుల్లో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు, కార్యదర్శి శివ ఆర్.రమణ, దైవ రాజు, బి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టండి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నెక్కంటి క్రాంతి కుమార్

విశాలాంధ్ర- నరసాపురం: పాలకొల్లు నుంచి మార్టేరు వరకు మార్టేరు నుంచి పెరవలి వరకు, రోడ్లన్నీ అధ్వా నంగా ఉన్నాయని, రోడ్లన్నీ గుంటలుగా ఏర్పడ్డాయని ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పూర్తిగా పాడైపోయిన రోడ్డులను వెంటనే నాణ్యతా ప్రమాణాలతో వేయాలని సిపిఐ నరసాపురం నియోజకవర్గ కార్యదర్శి, న్యాయవాది నెక్కంటి క్రాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాడైన రోడ్లు నిర్మించాలని కోరుతూ శనివారం సిపిఐ ఆధ్వర్యంలో ఆర్డీవో దాసిరాజుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులు ప్రజలు అనేక ప్రమాదాలకు గురి కాకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఎక్కువ కాలం ఉండే విధంగా నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయ రావు,పట్టణ నాయకులు సానబోయిన ఫణి రాజు, నాగల్ల భాస్కర రావు,కొల్లాటి ఆదినారాయణ, దొంగపూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో కళాశాల అభివృద్ధి

- కబడ్డీ క్రీడాకారులకు బూట్ల బహూకరణ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వం ప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులైన కబడ్డీ క్రీడాకారు లకు షూస్(బూట్లు) దాత ఆర్థిక సహాయంతో బహూకరణ చేయడం అభినందనీయమని దాతలు సహకారంతో కళాశాల అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి శనివారం అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వారు నిర్వహించే అంతర కళాశాలల కబడ్డీ పోటీలలో పాల్గొంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణపవరం విద్యార్థులు జీవన్,దిలీప్ కుమార్, జగదీష్, గురు ప్రసాద్, పవన్, గణేష్, సంజయ్ కుమార్, సాయి దుర్గ, జగదీష్, సిద్ధార్థ లకు గణపవరం టీడీపీ పట్టణ అధ్యక్షులు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు ఆర్థిక సౌజన్యంతో సుమారు 15వేల రూపాయలు విలువచేసే షూస్ ను సురేందర్ కుమార్ రాజు చేతులు మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ పి.మధురాజు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ చైతన్య, సోషల్ వర్క్ అధ్యాపకులు డాక్టర్ జి వెంకటరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 పిఓ డాక్టర్ జి. వెంకటరమణ,ఫిజికల్ డైరెక్టర్ పి.స్వాతి, విద్యార్థినీ ,విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వసూళ్లతో వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- కాల్ మనీ కేసులో ప్రధాని నిందితుడు సుధాకర్ సహా మరో ఇద్దరు అరెస్ట్
- బాధితులు నిర్భయంగా పోలీసులను ఆశ్రయించండి
- విలేకరుల సమావేశంలో కాల్ మనీ కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : పేదలను ఆసరాగా చేసుకొని వడ్డీకి డబ్బులు అప్పు ఇచ్చి వారి వద్ద నుండి అధిక వడ్డీల పేరుతో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల ప్రజలు భయాందో ళన వీడి నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. గత కొంతకాలంగా జిల్లా కేంద్రమైన ఏలూరులో చర్చనీయాంసమైన కాల్ మనీ కేసులో పోలీసులు మరింత పురోగతి సాధించారు. ఇందులో భాగంగానే ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో వన్ టౌన్ సిఐ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచి సిఐ ఆది ప్రసాద్, నిడమర్రు సీఐ సుభాష్, వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాష ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న ప్రధాన నిందితు డైన మేడపాటి సుధాకర్ రెడ్డితో పాటు అల్లాడ లావణ్య, వీరమల్ల రాజేష్ లను అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి శివ కిషోర్ నిందితుల వివరాలు వెల్లడించారు. ఏలూరు నగరంలోని సత్రంపాడు ప్రాంతం టెలికం నగర్ లో ఉన్న చలసాని రెసిడెన్సీలో నివాసం ఉంటున్న మేడపాటి సుధాకర్ రెడ్డి పేద ప్రజలను లక్ష్యంగా చేసుకొని అధిక వడ్డీలకు సొమ్ములు అప్పుగా ఇస్తూ వారిని వేధింపులకు పాల్పడుతున్నాడు. సుధాకర్ రెడ్డి అనుచరులుగా ఉన్న స్థానిక చలసాని రెసిడెన్సిలో నివాసం ఉంటున్న అల్లాడ లావణ్య, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి గ్రామానికి చెందిన వీరమల్ల రాజేష్, నగరానికి చెందిన గూడవల్లి విద్యాసాగర్, మహమ్మద్ అఖిల్ రెహమాన్ లు ప్రతినిత్యం అప్పులు ఇచ్చిన వ్యక్తులకు ఫోన్ చేసి నానా దుర్భాషలాడడమే కాకుండా వారిని వేధింపులకు పాల్పడుతుండేవారు. నిర్ణీత సమయంలో వడ్డీలు చెల్లించకపోతే వారి ఇళ్లకు వెళ్లి ఇంట్లో ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకొని ఇబ్బందులకు గురి చేసేవారు. అప్పులు తీసుకున్న వ్యక్తుల వద్ద నుండి ముందుగానే ఖాళీ బ్యాంకు చెక్కులు, ప్రాంసరీ నోట్లను తీసుకోవడంతో అప్పులు తీసుకున్న పేద ప్రజలు చేసేదేమీలేక మిన్నకుండి పోయేవారు. ఈ తరుణంలో విరక్తి చెందిన కొందరు బాధితులు వీరందరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని కలవడంతో ఆయన ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కిషోర్ కు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వ్యాప్తంగా ఏలూరు 1 టౌన్ పిఎస్ తో పాటు ఏలూరు రూరల్, ఏలూరు టూ టౌన్, త్రీ టౌన్, టి.నరసాపురం, ముసునూరు పోలీస్ స్టేషన్ లలో 7 కేసులు నమోదయ్యాయి. దీంతో ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా విద్యాసాగర్, అఖిల్ రెహమాన్ లను గతంలోనే అరెస్టు చేశారు. అప్పటికే సమాచారం అందుకున్న సుధాకర్ రెడ్డితో పాటు లావణ్య, రాజేష్ లు పరారవడంతో సుధాకర్ రెడ్డికి చెందిన బ్యాంక్ అకౌంట్లలో ఉన్న రూ.48 లక్షల నగదు సీజ్ చేశారు. సుధాకర్ రెడ్డి తన అనుచరుల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.3.5 కోట్ల రూపాయలు అక్రమ వడ్డీల రూపంలో ప్రజల నుండి వసూలు చేసినట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. దీంతో ఏ1 ముద్దాయి అయిన సుధాకర్ రెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టి అతనితో పాటు అనుచరులైన లావణ్య, రాజేష్ లను శనివారం అరెస్టు చేశారు. ముద్దాయిలను చాకచక్యంగా అరెస్ట్ చేసిన ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, నిడమర్రు ఇన్స్పెక్టర్ సుభాష్, ఎస్బి సిఐ ఆది ప్రసాద్, సబ్-ఇన్స్పెక్టర్ మదీనా బాషా, కానిస్టేబుళ్ళు మోహన్ కృష్ణ, నాగార్జున, లక్ష్మినారాయణ, నాగరాజులను ఎస్పి కిషోర్ అభినందించారు.

పోలీసు అమరవీరుల వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పోలీసు శాఖ, ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోలీసు అమర వీరుల వారోత్సవాల బ్రోచర్ను డి.ఎస్.పి. ఆర్. జే.జయసూర్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజారక్షణలో ప్రాణాలు సైతం కోల్పోతారు అనడానికి పోలీ సుల అమర వీరుల వారోత్సవాలే నిదర్శనమ న్నారు.రాష్ట్ర పోలీసుల ఉత్తర్వుల మేరకు ఎస్.పి. నేతృత్వంలో ఈనెల 21 నుంచి 31 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారోత్సవాల నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోలీసులకు ప్రజలు కూడా సహకరిస్తే మరింత పటిష్టంగా భద్రత కల్పిస్తారన్నారు. ఎస్.పి. నేతృత్వంలో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థు లకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో 1,2 పట్టణ సిఐలు నాగరాజు,కాళీ చరణ్,ఎస్.ఐ. లు, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశ ప్రగతి

ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

విశాలాంధ్ర - పాలకోడేరు: విద్యతోనే దేశ ప్రగతి సాధిస్తుందని ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. శనివారం పాలకోడేరు మండలం వేంద్ర భూపతి రాజు శుభ తాతరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్, మనబడి - మన భవిష్యత్తు పథకానికి సంబంధించిన నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు గదుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపి వారి భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పాఠశాలలలో కావలసిన సౌకర్యాలు కల్పించడానికి తను ముందుంటానని అన్నారు. భీమవరం ఆర్డీవో ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, తదనుగుణందా ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. పాఠశాలల రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి మాట్లాడుతూ ప్రస్తుతం చదువుకోవ దానికి ప్రభుత్వం

అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని దీనిని ప్రతి ఒక్క విద్యార్థి చక్కగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం జీవివి శ్రీనివాస్, ఉండి జనసేన పార్టీ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, మండల అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు, మాజీ మండల అధ్యక్షులు చలపతి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొల్లులో పెరిగిన ట్రాఫిక్

- కొరవడిన నియంత్రణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలో ట్రాఫిక్ భారీగా పెరిగింది. ప్రజలు ప్రయాణికులు కిక్కిరిసిన ట్రాఫిక్ సమస్యతో అల్లాడు తున్నారు. అరకొరగా ట్రాఫిక్ పోలీసులు విధులను నిర్వహిస్తున్నప్పటికీ సిబ్బంది లేమి కారణంగా పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సమస్యను అదుపు చేయలేకపోతున్నారు. శనివారం సాయంత్రం ఊహించని విధంగా వాహనాలతో రహదారులు నిండిపోయాయి. తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కదిలేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారులు కలగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవిపేట గ్రామపంచాయతీ పరిధిలో పల్లె పండుగ కార్యక్రమంలో బాగంగా తిరుమలదేవిపేట, మధ్యా హ్నాపువారిగూడెం గ్రామాలలో రూ. 70 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లుకు స్థానిక సర్పంచ్ గొల్లపల్లి సరోజిని,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెండ్యాల ప్రసాద్, జట్ల సత్యనారాయణ, ఆళ్ల బాలాజీ, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

విశాలాంధ్ర-కామవరపుకోట:కామవరపుకోట చినరాజప్ప ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఈనెల 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కామవరపు కూడా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. సరళ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం గం.9నుండి మధ్యాహ్నాం గం.2వరకు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు.

జనసురక్ష బీమా ప్రయోజనాలను పొందండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర – భీమవరం : ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి రక్షణగా నిలవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు ప్రతి కుటుంబానికి భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు జనసురక్ష పథకాలను భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా 2015లో ప్రారంభించడం జరిగిందన్నారు. బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ లో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకాలలో చేరేందుకు అర్హులేనని తెలిపారు. ఇందుకోసం బ్యాంక్ ఎకౌంటును ఆధార్‌తో అనుసంధానించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీసుకు వెళ్ళి సంబంధిత దరఖాస్తును పూరించి పథకాలలో చేరాల్సి ఉంటుందన్నారు.

పోలీసుల కుటుంబాలకు సహకారం : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు :విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అన్ని విధాల పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. జిల్లాలో పని చేస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన ఎస్ఐ రామ చంద్రరావు కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ నుండి 1 లక్ష రూపాయలు చెక్‌ను శనివారం రామచంద్ర సతీమణి కె.వెంకటేశ్వరమ్మకు ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండండి : సీఐ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఇటీవల కాలంలో సోషల్ మీడియా ద్వారా నేరాలు పెచ్చు మీరాయని, అందువల్ల విద్యార్థిని విద్యార్థులు సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు హితవు పలికారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై శనివారం ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతి ప్రియ ఏలూరు సైబర్ సెల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధు వెంకట రాజా స్థానిక సెంట్ థెరిసా మహిళా కళాశాలలో విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా మాధ్యమాలలో సైబర్ కేటుగాళ్ల బారిన పడకుండా మనల్ని కాపాడే విధంగా బలమైన పాస్వర్డ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపించే లింకులు గానీ, మెసేజ్లు గాని స్పందిస్తే నష్టపోతారని గుర్తించాలన్నారు. పాస్‌వర్డ్ కచ్చితంగా 8 అంకెల కంటే తక్కువ ఉండకూడదని, అక్షరాలతో పాటు నెంబర్లు, గుర్తులను జత చేస్తే పాస్‌వర్డ్‌ని బ్రేక్ చేయడానికి హ్యాకర్‌కి కొన్ని సంవత్సరాలు పడుతుందనేది గ్రహించాలని చెప్పారు. సైబర్ క్రైమ్ బారిన పడినవాళ్ళు తక్షణం సహాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చేయడం లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

విశాలాంధ్ర – కలిదిండి : విద్యార్థులలో మేధోశక్తిని పెంపొందించడానికి వ్యాసరచన పోటీలు దోహదపడతాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ పి. ప్రవీణ్ సాగర్ తెలిపారు. శనివారం పేట కలిదిండి ఎంపీపీ స్కూల్‌లో జాగురుకత అవగాహన వారోత్సవాలు పురస్కరించుకొని విద్యార్థినీ విద్యార్థులకు అవినీతిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ సాగర్ మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులపై అవినీతిని నిర్మూలించే బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు నిజాయితీగా ఉండి అవినీతి ప్రశ్నించాలన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.పావని ప్రవంతి, హెచ్ఎం ఎ. రాజమోహన్, ఉపాధ్యాయులు పి.వి సాగర్ బాబు, బి. సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కానరాని మహిళా ప్రజాప్రతినిధులు

భర్తలదే ఆధిపత్యం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం :మహిళలు రాజకీయాలలోకి రావడానికి మొదట ఇంటి నుండే ప్రోత్సాహం ఉండాలి. మహిళా రిజర్వేషన్లు వస్తే రాజకీయాలలో వారికి మరిన్ని అవకాశాలు వస్తాయి.ఇది తరచూ రాజకీయ నాయకులు చెప్పే మాట. కానీ ఆచరణలో ఎక్కడా కానరాదు.దీనికి నిదర్శనం ఇటీవల మండలంలో జరిగే పలు కార్యక్రమాలే. మండల కేంద్రమైన కొయ్యల గూడెం పట్టణం పరింపూడి గ్రామపంచా యతీ పరిధిలో శనివారం నూతనంగా నిర్మిస్తున్న సిసి రహదారుల భూమి పూజకు మహిళా వార్డు సభ్యుల భర్తలు హాజరవ్వడం విశేషం. ప్రభుత్వ కార్యాలయాలలో కార్యక్రమాలలో ఏర్పాటు చేసే సమా వేశాలకు మహిళా ప్రజాప్రతినిధులు మచ్చుకైనా హాజరు కావడం లేదు.వారి స్థానంలో మహిళా ప్రజాప్రతినిధుల భర్తల హవా నడుస్తున్నది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో వార్డు సభ్యులుగా ఉన్న మహిళలు సైతం కనిపించడం లేదు.దీంతో ప్రభుత్వ అధికారులు కూడా ప్రోటోకాల్ నిబంధనలను పక్కనపెట్టి మహిళా ప్రజా ప్రతినిధుల భర్తలకు మాత్రమే సహకారం చడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎన్నికల సమయంలో ఓట్లను అభ్యర్థించ డానికి మాత్రమే మహిళలు కనిపిస్తున్నారని ,ఎన్నికైన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలలో వారి భర్తలు పాల్గొనడంపై మండలంలో విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా స్పందించి అభివృద్ధి కార్యక్రమాలలో మహిళా ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలని, లేదంటే మహిళా రిజర్వేషన్ అబాసు పాలయ్యే ప్రమాదం ఉంది.

జీవో రద్దుతో నష్టపోతున్నాం

విశాలాంధ్ర – వేలేరుపాడు : జీవో నెంబర్ మూడు రద్దు చేయటం వలన గిరిజన యువత ఎంతో నష్టపోతున్నామని న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే చిర్రి బాలరాజును స్థానిక నిరుద్యోగులు కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి గిరిజన నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు.జీవో నెం మూడు పునరుద్ధరణ చేసి చట్టబద్ధత కల్పించాల న్నారు. రద్దు అయిన జీవో వలన రిజర్వేషన్ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని ఇప్పుడు మన రాష్ట్రంలో డీఎస్సీ అదేవిధంగా అమలు చేస్తే ఎంతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్సి నోటిఫికేషన్ వచ్చే లోపు జీవో నెంబర్ మూడుపై స్పష్టత వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తూ పలు సమస్యలను తెలియజేస్తూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు కోటం లక్ష్మణరావు, నూనె శివాజీ, తెల్లం అజయ్, కారం నవీన్ కుమార్, తొడం నాగరాజు, కారం బేబీ శ్యామల, మడకం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

విశాలాంధ్ర-ఉండి : బాల్యవివాహాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అంగన్వాడి సూపర్వైజర్ బాల కుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఉండి తహసీల్దార్ కార్యాలయం వద్ద బాల్య వివాహాలను నిర్మూలించండి, సమాజ శ్రేయస్సుకు సహకరించండి అని అంగన్వాడీలు ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా బాలకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.బాల్య వివాహాలను చేసినా ప్రోత్సహించినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వ హిస్తే చుట్టుపక్కల వారు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ గడి కుసుమ, విజయ,చైతన్య, అన్నపూర్ణ,రెవెన్యూ సిబ్బంది,కిషోర్ బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర -నూజివీడు : బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 పై నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నూజివీడు ఆర్డిఓ ఎం.వాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శి నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటితో సత్సంబంధాలు కలిగి ఉండడం ద్వారా ఎక్కడ బలే మోహం జరుగుతుందో తెలిసిన అవకాశం ఉంటుందని తద్వారా బాల్య వివాహాలను అరికట్టే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడం మహిళా సంరక్షకుల ముఖ్య పాత్ర అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు ద్వారకాతిరుమలలో సీపీఐ బహిరంగసభ

విశాలాంధ్ర – ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని యుటిఎఫ్ భవనంలో ఆదివారం ఉదయం 10గంటలకు జరగనున్న మండల బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక యుటిఎఫ్ భవనంలో బహిరంగ సభకు కావాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చైతన్య మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలో ప్రథమసభ నిర్వహిస్తున్నా మన్నారు. బహిరంగసభలో ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. మండలంలోని సిపిఐ నాయకులు తప్పక హాజరుకాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు జేవీ రమణరాజు, ద్వారకా తిరుమల మండల నాయకులు గొలిమే ఏసు, బాలరాజు, గంగాధరరావు, గుడి ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్యానల్ లాయర్లు శనివారం శనివారం పేట జడ్పీ హైస్కూల్ , సుబ్బమ్మ దేవి హై స్కూల్, గాంధీ మున్సిపల్ హై స్కూల్, సత్రంపాడు, వట్లూరు ఎంపీపీ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథక అమలుపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యతను, పరిమాణమును,త్రాగునీరు సౌకర్యాలు, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి వీటికి సంబంధం చిన అంశాలపై ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. సత్రంపాడు హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల పిల్లల రాకపోకలకు చాలా ఇబ్బంది కలిగిస్తుందని, దీనిపై ప్రధాన ఉపాధ్యాయులు జిల్లా అధికారులను సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, పి. వెంకటేశ్వరరావు,జీ.వి. భాస్కర్, ఎ. గంగాభవాని, పారా లీగల్ వలంటీర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర -ఉంగుటూరు : క్షేత్రస్థాయిలో ప్రజలకు జన ఆరోగ్య సమితి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆ కమిటీ చైర్మన్, సర్పంచ్ బందారు సింధు మధుబాబు అన్నారు. శనివారం స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. డాక్టర్ కస్తూరి శిరీష ఉప సర్పంచ్ పాతూరి జగదీష్, చోడే శ్రీనివాసరావు, తల్లాప్రగడ భీమేశ్వరరావు, కాలి మంగన్న,తదితరులు పాల్గొన్నారు.

ఏకే ఆర్ట్స్‌లో రతన్ టాటా విగ్రహం తయారీ

విశాలాంధ్ర – పెనుమంట్ర: పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం ఏకే ఆర్ట్స్ లో పారిశ్రామిక వేత్త, పద్మవిభూషణ్, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. శిల్పి పెనుగొండ కరుణాకర్ ఉడయార్ నమూనా విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఉండి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన ఆర్డర్ మేరకు ఈ విగ్రహం తయారు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే కేవలం తమ వద్ద మాత్రమే అందుబాటులో ఉన్న డిజిటల్ టెక్నాలజీ ద్వారా త్రీడీ రూపంలో విగ్రహాల కోసం వివిధ ప్రాంతాల నుంచి పలువురు తమ సంస్థను సంప్రదించినట్లు తెలిపారు. రతన్‌టాటా విగ్రహం తయారు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని రెవెన్యూ గ్రామాలలో శనివారం నుండి నవంబర్ 5వ తేదీ వరకూ రీ సర్వేపై సమస్యలు తెలుసుకునేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ చిన్నారావ్ మీడియాకి తెలిపారు. ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 5 వరకూ షెడ్యూల్ ప్రకారం రీ సర్వే పూర్తయిన గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి భూ సమస్యలు పై దరఖాస్తులు స్వీకరిస్తామని తెలియచేసారు. కాలేరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో వివిధ భూ సమస్యలు పై 23 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. రెవెన్యూ గ్రామ సభలోభూ సమస్యలు పై అందిన దరఖాస్తులు పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వై శ్రీనివాస్ చౌదరి, సర్వేయర్ మణికంఠ, కాలేరు విఆర్వో పివివి సత్య నారాయణ, విఆర్ఏలు పలివెల నాగేశ్వరరావు, అడపాక శివ ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్, వివిధ గ్రామాల నుండి వచ్చిన విఆర్ఓలు, సర్పంచ్ దాయం కావేరి శేఖర్, ఎంపీటీసీ సత్య మంజు, టీడీపీ నాయకులు రామకృష్ణ చౌదరి, వల్లూరి కాశీ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పాట్రిక్స్ అకాడమీ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెంలోని ఎస్‌టి పాట్రిక్స్ అకాడమీలో జరిగిన ఆర్ట్స్, క్రాఫ్ట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులు తయారు చేసిన పరికరాలను చూసి, వారి కృషిని ప్రశంసించారు. సైన్స్, ఆర్ట్స్, క్రాఫ్ట్‌లలో విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, విద్య ముఖ్యమైనదని, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా దేశ అభివృద్ధికి సహకరించాల్సిన బాధ్యత యువతపై ఉందని చెప్పారు. భవిష్యత్తులో వారు పెద్ద విజ్ఞానవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

జిల్లా కేబుల్ ఆపరేటర్ల సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం చిర్ల కనికిరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ సంక్షేమ సంఘం సమావేశానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరయ్యారు. సత్యానందరావును పూలమాలలు, దుశ్శాలువాలతో సంఘం సత్కరించింది. తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల పట్టాభి రామయ్య, కంఠంశెట్టి శ్రీనివాస్, కాసాసాగర్, గుబ్బల మూర్తి, కముజు శ్రీను పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డుపై గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర - సామర్లకోట : కాకినాడ జిల్లా సామర్లకోట కెనాల్ రోడ్డులో జీ మేడపాడు పరిసరాల్లో వాహనదారులకు ప్రమాదాలు కలిగిస్తున్న పెద్ద, పెద్ద గోతులను పూడ్చివేయడానికి శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు ముందుకు వచ్చారు. తెలుగు రైతు కాకినాడ పార్లమెంట్ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు నేతృత్వంలో రోడ్ల మరమ్మత్తులు కార్యక్రమం చేపట్టారు. గ్రామ స్థాయిలో నుండి పాలవూరు నాయకులు కూడా పాల్గొని, శ్రీనుబాబును అభినందించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట నుండి కాకినాడ వెళ్ళు రోడ్డుపై ఎక్కువగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో వాహనాలు తిరగబడిపోవడం తరచూ ప్రమాదాలు జరగడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. అయితే సామర్లకోట ట్రాఫిక్ పోలీసులు, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగరావు స్పందించి లారీలతో కంకర, బూడిదలను తెప్పించి భారీగా ఏర్పడిన గుంతలను దగ్గర నుండి పూడ్చారు. దీనితో వాహనదారులకు కొంతమేర ఉపశమనం కలగడంతో అందరూ ట్రాఫిక్ పోలీసులును అభినందించారు.

సమపాళ్లలో సంక్షేమం అమలు : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట,కిర్లంపూడి : గ్రామాలు అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండలం చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి, భూపాలపట్నం, గోనెడ గ్రామాల్లో శనివారం పల్లె పండుగ, పంచాయితీ వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అటు అభివృద్ధిని, ఇటు సంక్షేమాన్ని సమపాళ్ళలో అమలు చేస్తున్నా రన్నారు. కిర్లంపూడి మండలంలో ఏలేరు వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకున్నప్పుడే నిజమైన సంక్షేమమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జగపతినగరం సర్పంచ్ శ్రీలత రాంబాబు, భూపాలపట్నం సర్పంచ్ ఖాశి బాబు, జనసేన ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ నాయకులు గాంధీ, చంటిబాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ రీ సర్వే సమస్యలకు సత్వర చర్యలు

విశాలాంధ్ర - ఆలమూరు : రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని తాసిల్దార్ కెజె ప్రకాష్ బాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని కలవచర్ల గ్రామంలో శనివారం రీసర్వేలో వచ్చిన భూ సమస్యల వినతుల స్వీకరణ గ్రామసభను నిర్వహించారు. రీసర్వేలో జరిగిన తప్పులను సర్పంచ్ వడ్డీ వెంకన్న అధ్యక్షతన వహిస్తూ తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు, భూయజమానుల వద్ద నుండి 18 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జరిగిన సభలో తాసిల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో జరిగిన తప్పిదాలను గ్రామాల్లో రైతులు రాతపూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. అలాగే నేడు ప్రారంభించిన ఈ రీ సర్వే గ్రామ సభల్లో భాగంగా ఈనెల 21న గుమ్మిలేరు, 22న మడికి, 23న మోదుకూరు, 24న నవాబుపేట, 25న పెదపళ్ల, 28న పెనికేరు, 29న బడుగువానిలంక, 30న ఆలమూరు, నవంబర్ ఒకటిన చింతలూరు, 2న చొప్పెల్ల, 3న నర్సిపూడి, 5న సంధిపూడి గ్రామాలలో ఈ రెవెన్యూ సభలు నిర్వహించనున్నామన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామాయమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి వి వేణు, గ్రామ విఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు, లింక్ రోడ్లకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే పంతం నానాజీ

విశాలాంధ్ర - కరప : గ్రామీణ రోడ్ల, ఒక గ్రామం నుండి మరొక గ్రామం అనుసంధానం చేసేపంత రోడ్లను అభివృద్ధి చేస్తామని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. శనివారం కరప మండలంలో పేపకాయల పాలెం, పెనుగుదురు నడకుదురు, గురజానపల్లి, ఉప్పలంక, గ్రామాలలో ఎమ్మెల్యే నానాజీ పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 12 కోట్ల 63 లక్షలతో గ్రామీణ రోడ్లను, 17 కోట్ల రూపాయలతో లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, పెంకె శ్రీనివాస్ బాబా, కటకం శెట్టి బాబి, నురుకుర్తి వెంకటేశ్వరరావు, బండారు మురళి, భోగి రెడ్డి గంగాధర్, భోగిరెడ్డి కొండబాబు, ఎంపీడీవో అనుపమ, తాసిల్దార్ ఎం సత్యనారాయణ, ముద్రగడ రమేష్, వై పండు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు : నియోజకవర్గంలో ఉన్న గ్రామాల అభివృద్ధే కూటమి ధ్యేయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు మండలంలోని కూనవరం, కడలి, వేగివారి పాలెం, బి సావరం, పాలగుమ్మి గ్రామాలలో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెలు ప్రగతి పథాన నడవనున్నాయని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో రూ.11.30కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్క్ ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పెదపూడి : పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం మండలంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్ల శంకుస్థాపన చేయనున్నారని ఎంపీడీవో కె నరేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ పైన, వేంద్ర, సంపర, శహపురం, కైకవోలు, పెదపూడి, కరకుదురులో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

గొడ్డటిపాలెం సర్పంచ్‌గా అనూష

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొడ్డటి పాలెం గ్రామంలో సర్పంచ్‌గా గెలుపొందిన వాసంశెట్టి శ్రీనివాస్ తన సర్పంచి పదవికి రాజీనామా చేసి ప్రభుత్వ ఉద్యోగిగా చేరడంతో ఆ గ్రామంలో సర్పంచ్ పదవి కాళీ ఏర్పడింది. ఉప సర్పంచ్‌గా గోన అనూష ఆంజనేయులు ఆ గ్రామంలో పనిచేస్తుండగా ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగించడం జరిగిందని మండల పరిషత్ సూపరిండెంట్ బివిఎల్ నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భోగి రెడ్డి గంగాధర్, గోన అంజి, నక్క బ్రహ్మాజీ, ఆలమూరు చిన్నారావ్, ఎం శ్రీను, శంకర్, డి శ్రీను పాల్గొని అభినందనలు తెలియజేశారు.

టొయోటా గ్లాంజా

'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయం

విశాలాంధ్ర - రాజమండ్రి : పండుగ స్ఫూర్తిని మరింత పెంచుతూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్ ఈ రోజు టొయోటా గ్లాంజా 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేస్తున్నట్లు ప్రక టించింది. ఈ సందర్భంగా టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ కస్టమర్లు ఇప్పుడు ప్రత్యేకమైన డీలర్-ఫిట్టెడ్ టొయోటా జెన్యూన్ యాక్సెసరీ (టిజిఏ) ప్యాకే జీలను ఆస్వాదించవచ్చు అన్నారు. ఈ పండుగ కాలంలో గ్లాన్జా మెరుగైన శైలి, పనితీరు, సౌలభ్యంతో వారి డ్రైవింగ్ అను భవాన్ని మెరుగు పరచడానికి రూపొందించబడిందన్నారు. అధునాతన సాంకేతికత, సొగసైన డిజైన్ అధిక ఇంధన సామర్థ్యం కలిగిన పరిమిత-ఎడిషన్ టొయోటా గ్లాన్జా రూ.20,567 విలువైన 13 ప్రత్యేకమైన టిజిఏ ప్యాకేజీతో వస్తుందన్నారు. వాహనంలో ప్రీమియం క్రోమ్ మరియు బ్లాక్ బాడీ సైడ్ మౌల్డింగ్, బ్యాక్ డోర్ గార్నిష్ క్రోమ్ , ఓఆర్వి ఎం గార్నిష్ క్రోమ్ వంటి ప్రత్యే కమైన అం శాలు ఉన్నాయన్నారు. అదనపు సౌల భ్యం కోసం 3డి ఫ్లోర్ మ్యాట్, డోర్ వైజర్ ప్రీమి యం, నెక్ కుషన్‌లు (బ్లాక్, సిల్వర్) ఉన్నా యని, టయోటా గ్లాంజా ఫెస్టివ్ లిమి టెడ్ ఎడిషన్ అన్ని వర్గాల్ని ఆకట్టుకుంటుందని చెప్పారు.

సంక్షోభంలోనూ అభివృద్ధి

విశాలాంధ్ర - కాకినాడ : వరుసగా ఐదవరోజు కూటమి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలలో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి 12 కోట్ల 63 లక్షల రూపాయల నిధులు కాకినాడ రూరల్ మండలానికి 8 కోట్ల 70 లక్షల రూపాయలు, కరప మండలానికి 3 కోట్ల 93 లక్షల రూపాయలు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్‌కి ఎమ్మెల్యే పంతం నానాజీ కృతజ్ఞతలు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ పాల్గొని స్థానిక కూటమి నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మీడియాతో మాట్లాడుతూ సంక్షోభంలో కూడా అభివృద్ధి పథంలో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి నిధులు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో సం బంధిత శాఖల అధి కారులు, టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి వర్యులు చిక్కాల రామచంద్రరావు, సురు కుర్తి వేంకటేశ్వర రావు, పెంకె శ్రీనివాస్ బాబా, కూటమి నాయకులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో బాస్కెట్ బాల్ టీమ్ ఎంపిక

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెంలో ఉన్న ఆదిత్య విశ్వవిద్యాలయంలో 2024-2025కి సంబంధించిన బాస్కెట్ బాల్ టీమ్ సెలక్షన్ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎమ్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సెలక్షన్ ట్రయల్స్ పాల్గొని ఆదిత్య యూనివర్సిటీ టీంకి సెలెక్ట్ అయిన క్రీడాకారులు అందరినీ యూనివర్సిటీ యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ టీమ్ సభ్యులందరూ క్రీడా స్ఫూర్తితో మెలగుచూ చక్కటి ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ రమాశ్రీ, వి సత్య నారాయణ, త్రిపాఠి, ఎన్ రవి పాల్గొన్నారు.

ఏపీఎంఎఫ్ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - అమలాపురం : ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపిఎంఎఫ్) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ మహాసభ ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు అమలాపురం కిమ్స్ హాస్పిటల్ అండ్ మెడికల్ కాలేజి మీటింగ్ హాలులో నిర్వహిస్తారు. ఈ మహాసభ ఆహ్వానపత్రికను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, పాత్రికేయులు చొల్లంగి అప్పాజీ, గుత్తుల వెంకట రమణమూర్తి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల అభివృద్ధికి శ్రీకారం

విశాలాంధ్ర - పిఠాపురం : నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. చిత్రాడ, నవకండ్రవాడ, గోకవాడ, జముసపుల్లి, నరసింగపురం, కోలంక, మాదాపురం గ్రామాలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటి యాభై లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ పారిశ్రామిక సందర్శనలో భాగంగా వేమగిరి పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్‌ను సందర్శించినట్లు విభాగాధిపతి డా వి శ్రీనివాసరావు తెలియజేసారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించ బడుతున్న ఈ సంస్థ సిబ్బంది పవర్ గ్రిడ్ విధి విధానాలు గురించి విద్యా ర్థులకు వివరించారు. ప్రభుత్వ యాజమాన్యంలో పవర్ సిస్టమ్ ఆపరేషన్, కార్పొరేషన్ ద్వారా నిర్వహించబడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఉ డిప్యూటీ ప్రో ఛాన్సలర్, డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక సందర్శనల ప్రాధాన్యతను తెలిపారు.

ఉత్తమ సేవలే కెనరా బ్యాంకు ధ్యేయం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఖాతాదారులకు, వినియోగదారులకు ఉత్తమ ఉన్నత సేవలందించడమే తమ బ్యాంక్ ధ్యేయమని కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ (విజయవాడ) జనరల్ మేనేజర్ సీజె విజయలక్ష్మి అన్నారు. పెద్దాపురం పట్టణ మరిడమ్మ ఆలయ సమీపంలోని ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్. గణేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన కెనకా బ్యాంక్ ద్వారా మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా తమ బ్యాంక్ పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో లలిత రైస్ ఇండస్ట్రీస్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీలు మట్టే సత్యప్రసాద్, వి సత్య సాయిరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ప్రముఖ వ్యాపార వేత్త మట్టే శ్రీనివాసరావు, బ్యాంక్ డివిజనల్ మేనేజర్లు ఎం శ్రీనాథ్, ఏకె మహంతి, పెద్దాపురం బ్రాంచి మేనేజర్ అమిత్కుమార్, బ్యాంకు అధికారులు వై తవిటయ్య, కొండబాబు పాల్గొన్నారు.

మద్యం దుకాణ ఒప్పందంపై వివాదం

సీఎం చంద్రబాబు మాటలకు తూట్లు

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగుదేశం పార్టీ నేతలతో పాటు కూటమికి చెందిన ఏ నాయకులు మద్యం దుకాణాల విషయంలో కలుగజేసుకోవద్దని సీఎం చంద్రబాబు చెప్పినా ఆ విషయం కాకినాడలో అమలు కావడం లేదు. నేరుగా టీడీపీ కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు మద్యం షాపును దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారంటే చంద్రబాబు మాటకి ఏ విధంగా విలువ ఉందో అర్థమవుతోంది. ఈ మద్యం షాపును నగర అధ్యక్షుడు వీరు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం పలు వివాదాలకు తావిస్తోంది. ఇక విషయంలోకి వెళ్తే కాకినాడ సంజయ్ నగర్ ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప పిడుగులమ్మ గుడి వద్ద బ్రాందీ షాపు ఏర్పాటుకు స్థల యజమాని పైడా సత్య శ్రీరామ్ రెండు రోజుల క్రితం హైదరాబాద్ కుషాయిగూడ ప్రాంతానికి చెందిన తనకు రెండేళ్లపాటు ఒప్పంద పత్రం రాసినట్లు కే జీవన్ రెడ్డి చెప్పారు. తాము దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు పనులు చేస్తుండగా మల్లిపూడి విజయ్ కుమార్ అనే వ్యక్తికి చెందినవారు తమ పనులను అడ్డగించి తమపై దౌర్జన్యం చేశారని జీవన్ రెడ్డి చెప్పారు. దీనిపై తాము కాకినాడ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మల్లిపూడి విజయకుమార్ తరుపున ఆ దుకాణం వద్దకు హాజరైన నగర టీడీపీ అధ్యక్షుడు వీరు మాట్లాడుతూ అదే పైడా సత్య శ్రీరామ్ అనే వ్యక్తి తమకు రెండు నెలల క్రితం బ్రాందీ షాప్ ఏర్పాటు నిమిత్తం అగ్రిమెంట్ రాసారని చెప్పారు. ఇప్పుడు తమను కాదని వేరే వాళ్ళకి ఇవ్వడం పట్ల తాము ఇక్కడకు వచ్చి వారిని అడ్డుకుని మా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ఈ స్థలం అగ్రిమెంట్ విషయంపై తాను జీవన్ రెడ్డి అనే వ్యక్తికి అగ్రిమెంట్ పత్రం రాసానని స్థల యజమాని సత్య శ్రీరామ్ తెలిపారు. కాకినాడ 3 టౌన్ పోలీసులు సంఘటన స్థలం దగ్గరకు వచ్చి విషయాలను సేకరించారు. అలాగే ఈ మద్యం దుకాణం ఏర్పాటు విషయంలో టీడీపీ, జనసేనలకు చెందిన నాయకులు పరోక్షంగా భాగస్వాములుగా ఉన్నారని వారి వల్లే ఈ ఆధిపత్య ధోరణి కొనసాగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఈ దుకాణ ఏర్పాట్ల విషయంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే, కాకినాడ ఎంపీలకు చెందిన వారి గ్రూపుల మధ్య వివాదంగా మారే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

స్పోర్ట్స్ మీట్‌పై సమావేశం

విశాలాంధ్ర - యానాం : పుదుచ్చేరి రాష్ట్రం స్పోర్ట్స్ మీట్ ఈనెల 25 నుంచి మాహేలో జరగనుంది. డిసెంబర్‌లో నెలలో పుదుచ్చేరి రాష్ట్ర స్పోర్ట్స్ మీట్ యానాం డా వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జరుగునుందని ఈ స్పోర్ట్స్ మీట్‌కు శిక్షణ తీసుకుంటున్న యానాం క్రీడాకారులందరికి ఉదయం పోషక ఆహారం అందే విధంగా పాలు, రెండు కోడి గుడ్లను క్రీడాకారులకు యానాం స్పోర్ట్స్ మీట్ అయ్యేంతవరకు ప్రతిరోజు యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకుంటున్న అందరికీ మల్లాడి కృష్ణారావు పాలు, గుడ్లను అందజేశారు.

జెఎన్‌టియుకెలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏఐఎంఎల్ ఆధ్వర్యంలో "ఇండస్ట్రీ 4.0" అను అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) ది.19.10.2024 శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎఫ్‌డిపి ప్రోగ్రామ్‌కు ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ ఎఎస్ఎన్ చక్రవర్తి, సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా ఎల్ సుమలతలు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించగా డా టి శివరామకృష్ణ, డా ఇ సునీతలు కో-కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశా లను అందిపుచ్చు కోవాలంటే అధ్యాపకులు బోధ నలో వినూత్న పద్ధతులను అవలంభించాల్సిన ఆవ శ్యకత ఉందన్నారు. ఇటు వంటి ఎఫ్‌డిపిల ద్వారా అధ్యాపకులకు నూతన సాంకేతికతలను నేర్చుకునేందుకు ఆసక్తి పెరుగు తుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఎఫ్‌డిపి ప్రోగ్రామ్‌లను మరిన్ని నిర్వహించాలని ఆయన సూచించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాప్‌ను సద్వినియోగ పర్చుకున్న అధ్యాపకులను, పరిశోధక విద్యార్థులను ఆయన అభినందించారు. రీసోర్స్‌పర్సన్స్ విశాఖపట్నం ఎంఎస్ఎంఈలోని మెకట్రానిక్స్ విభాగాధిపతి డా కె మురళీకృష్ణ, ఫైటెక్ ఎంబెడెడ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా బి వల్లభరావులు ఇండస్ట్రీ 4.0లోని కీలక అంశాలైన ఐఓటి, ఏఐ&ఎంఎల్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, సైబర్ సెక్యూ రిటీ, డ్రోన్ టెక్నాలజీ, త్రీడి ప్రింటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి అంశాలను వివరించారు. వీటి వలన విద్య, వ్యవసాయం, ఆరోగ్యం మరియు ఇతర రంగాలలో వినూత్న అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఇటువంటి ఎఫ్‌డిపి ద్వారా పరిశ్రమ, విద్యారంగాల సంబంధాలను మెరుగుపర్చడంతో పాటు అధ్యాపకు లకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను నేర్పించడం, విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించడంలో మెరుగైన పాత్ర పోషించడం జరుగుతుందన్నారు. అనంతరం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు హాజరైన అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు ముఖ్యఅతిథి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్య క్రమంలో రీసోర్స్‌పర్సన్స్ యుసిఇకె అధ్యాపకులు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు, పరి శోధక విద్యార్థులు, ఎంటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయాలు సొంతం

- ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ప్రారంభం
- కోలాహలంగా రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్

విశాలాంధ్ర – రాజానగరం : ఏ రంగంలోనైనా నిరంతర సాధనతో విజయాలు సొంతం చేసుకోవచ్చని, అయితే సాధనలో భాగంగా ఏకాగ్రతకు నైపుణ్యం జోడించి తర్ఫీదు పొందాలని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని సంపత్నగరం లోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఏపీ పాఠశాల విద్యా శాఖ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ టీకే. విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన మూడు రోజులపాటు జరగనున్న 68వ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ క్రీడా జ్యోతి ని చేతపట్టి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను శనివారం ప్రారంభించారు. క్రీడ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రైఫిల్ తో లక్ష్యాన్ని గురి పెట్టి షూటింగ్ చేసిన దృశ్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ఉన్నత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించిన వారికి క్రీడా విభాగంలో ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. సంకల్ప బలంతో విద్యార్థులు ఆ దిశగా అడుగులు వెయ్యాలని కోరారు. 13 జిల్లాల నుంచి ఎంతో నమ్మకం తో తమ పిల్లలను రైఫిల్ షూటింగ్ పోటీల కోసం ఇంత దూరం పంపిన తల్లిదండ్రులు నమ్మకాన్ని నిలబెట్టి పోటీలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. రాజమహేంద్రి స్కూల్ అధినేత, క్రీడా పోటీలు అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే క్రీడా స్ఫూర్తిని అలవర్చు కోవడం ద్వారా భవిష్యత్తులో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు.తమ స్కూల్ నందు నాణ్యమైన విద్యతో క్రీడలను ప్రవేశ పెట్టి క్రీడా రంగానికి ఊతమిస్తు న్నామన్నారు.తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్.ఆర్.కె.వి.స్వామి మాట్లాడుతూ రైఫిల్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్ 14,17,19 బాలురు, బాలికల విభాగం లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు.ఇక్కడ గెలిచిన విజేతలు భోపాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. దీనిలో భాగంగా క్రీడాకారులు మార్చింగ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. అతిథులను పాఠశాల యాజమాన్యం దుశ్శాలువ కప్పి జ్ఞాపిక అందజేశారు.అనంతరం విద్యార్థులు పోటీలో పాల్గొని రోఫైల్ పోటీల్లో తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, క్రీడా సమాఖ్య సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, ఉప విద్యాశాఖాధికారి నారాయణ, రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టీ.స్వరూప్ రెడ్డి, ప్రిన్సిపాల్ టివిడి.చంద్ర శేఖర్,సంపత్ నగరం ఎంపీటీసీ సదానంద కిశోర్, తిరుమల నాధుని నాని, చిన్నబాబు, నల్ల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీలో సుప్రజకు తృతీయ స్థానం

విశాలాంధ్ర – అనపర్తి : ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, సెట్ రాజ్ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పెయింటింగ్ పోటీలో జిబిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని బది రాజు లక్ష్మి సుప్రజా పార్వతికి తృతీయ స్థానం లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ పెద అబ్బాయి రెడ్డి తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ అబ్బాయి రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా అమలాపురం అంబేద్కర్ భవన్లో నిర్వహించిన జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై పెయింటింగ్ పోటీలో సుప్రజా పార్వతికి తృతీయ స్థానం లభించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి సెట్ రాజు, సీఈవో కే ఎస్ వి కాశీ విశ్వేశ్వర రావు పాల్గొన్నారని తెలిపారు. సుప్రజాను విద్యా సంస్థల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), పాలకవర్గ సభ్యులు గొలుగూరి రామారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి, డైరెక్టర్లు బి రత్నారెడ్డి, డివిఆర్ఎ పాపిరెడ్డి, కె హరినాథ రెడ్డి, సి హెచ్ ఆనంద్‌రావు తదితరులు అభినందించారు.

పల్లె పండుగతో గ్రామాల్లో వెలుగులు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర – రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగతో పల్లెల్లో వెలుగులు నిండుతాయని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని హౌసింగ్ బోర్డు నందు శని వారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో వివిధ అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించి సమస్య లు పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాల నిధులతో వివిధ సంక్షేమ పథకాల అభివృద్ధికి శ్రీకారం చుట్టను న్నారు. దీనిలో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కెవి ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జనసేన పార్టీ నా సేన నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంక టలక్ష్మి కలిసి ప్రారంభించారు.అలాగే సిసి డ్రైన్ మరమ్మత్తులు మరియు సిసి డ్రైన్ నిర్మాణాలు,పలు అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ, సీఐ పీ.కాశీ విశ్వనాథ్, విద్యుత్ శాఖ ఏఈ,ఎన్డీఏ కూటమి నాయకులు రాయుడు శ్రీను,బొమ్ముల సతీష్, ఖాదా ఈశ్వరరావు, వెగిరాజు సునీత, బొర్రా బాలు, బొర్రా వెంకటేశ్వరరావు,అధికారులు పాల్గొన్నారు.

పెరవలి పోలీసులపై సస్పెన్షన్ వేటు

విశాలాంధ్ర – పెరవలి : తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలంలో సీఐ, ఎస్సై సహా నలుగురు పోలీస్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి శనివారం మండలంలో చర్చనీయంగా మారింది. నిడదవోలు సర్కిల్ పరిధిలోని పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామం వద్ద పేకాట శిబిరంపై గత నెలలో పోలీసులు దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్ల నుండి 6 లక్షల 45 వేల రూపాయలు స్వాధీనం చేసుకుని పోలీసులు చేతివాటం ప్రదర్శించి, 55 వేల రూపాయలు మాత్రమే దొరికినట్లు కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కి విషయం తెలిసి రహస్య విచారణ జరిపారు. పోలీసుల చేతివాటం రుజువు కావడంతో నిడదవోలు సిఐ శ్రీనివాస్రావు, పెరవలి ఎస్ఐ అప్పారావు, రైటర్ బుద్ధేశ్వర్రావు, కానిస్టేబుల్ ఎల్లారావు లకు సస్పెన్షన్ ఆదేశాలు జారీచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఎస్ఐ అప్పారావు ఇటీవలే నిడదవోలు నుండి బదిలీపై రావడం కొద్దిరోజులలోనే ఈవిధంగా సస్పెన్షన్ కావడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది.చట్టం ఎవరికైనా ఒక్కటే అన్న నిదర్శనానికి ఇది ఒక ఉదాహరణ అని పలువురు అంటున్నారు.

పుల్లా చంటియ్య కుటుంబానికి పలువురి పరామర్శ

విశాలాంధ్ర – కడియం : కడియపులంక గ్రామానికి చెందిన ఇటీవల మృతిచెందిన శ్రీసత్యదేవ నర్సరీ రైతు, మాజీ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. చంటియ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చంటియ్య నర్సరీ రంగం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పుల్లా సోదరులకు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేశారు. చంటియ్య కుటుంబాన్ని పరామర్శించిన వారిలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, తూర్పు గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, మాజీ తూర్పుగోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ గూడా చైర్మన్ గన్ని కృష్ణ, మాజీ రాజమండ్రి రూరల్ వైసిపి కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, సిసిసి ఛానల్ ఎండి పంతం కొండలరావు, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, సెక్రటరీ గాధ నాగేశ్వరరావు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను, ఈలి గోపాలం, కొత్తపల్లి శివాజీ, బోడపాటి సత్తిబాబు, పాలపర్తి ప్రకాష్, కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యా కమిటీ, ఉపాధ్యాయుల స్వీయ నిధులతో క్రీడాస్థలం అభివృద్ధి

విశాలాంధ్ర – కడియం: విద్యార్థులు అటు చదువులోను, ఇటు క్రీడల లోను రాణించేవిధంగా శిక్షణ ఇచ్చేందుకు ఉపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ కూడా కృతనిశ్చయంతో ఉందని కడియం మండలం ముర మండ తమ్మన సూర్య ప్రకాశం, బొబ్బా జానకి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కాటే జ్యోతి బాబు, ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ పేర్కొన్నారు. ఈ పాఠశాలకు సంబంధించిన క్రీడా మైదానంలో, ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిచ్చి మొక్కలు పెరిగి, విష సర్పాలకు నిలయంగా మారింది. దీనితో విద్యార్థులు అటువైపు వెళ్ళ డానికి భయాందోళనకు గురవుతున్నారు. దీనిని గుర్తించిన విద్యా కమిటీ చైర్మన్ కాటే జ్యోతి బాబు, ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ తదితరులు సుమారు పదిహేను వేల రూపాయలు ఖర్చుతో కలుపు మందును పిచికారి చేయించారు. మరో రెండు రోజుల్లో విద్యార్థుల ఆటలకు ఈ క్రీడా మైదానం అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. విద్యా కమిటీ, ఉపాధ్యాయులు కలిసి స్వీయ నిధులతో క్రీడా స్థలాన్ని అభివృద్ధి చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర – సీతానగరం: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సబ్ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చిట్టిబాబు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్ ఐ రామ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరు స్మార్ట్ మొబైల్ వినియోగిస్తున్నారని దీనితోనే సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. మన వ్యక్తిగత వివరాలను వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ వంటి వివిధ రకాల సోషల్ మీడియా యాప్ లలో పొందుపరచడం వలన నేరగాళ్లకు సులువుగా మన వ్యక్తిగత వివరాలు తెలుస్తున్నాయని వాటిని వినియోగించి వారు బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతున్నారని అన్నారు. ఇటువంటి వాటికి చోటు లేకుండా ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత వివరాలను ఏ విధమైన సోషల్ నెట్వర్క్లో పొందుపరచకుండా ఉండాలని అన్నారు. అలాగే తెలియని ఫోన్ నెంబర్ నుండి కాల్ వస్తే మీ వ్యక్తిగత వివరాలను ఓటీపీలను చెప్పకూడదని అన్నారు. ప్రిన్సిపల్ చిట్టిబాబు మాట్లాడుతూ మారుతున్న ప్రపంచంతో పోటీ పడాలంటే టెక్నాలజీ పరంగా మనం కూడా అభివృద్ధి చెందాలని అలాగని సోషల్ మీడియాకు బానిసలు కాకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామ కృష్ణ, అధ్యాపకులు నాగేశ్వరరావు, మాధవ్, సుధామాయి, పోలీస్ సిబ్బంది ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల కమిషన్ గారి కోర్టులో, విజయవాడ
F.A.No: 227 of 2024 in C.C. No: 21 of 2021
(పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల ఫోరమ్ ఏలూరు వారి ఫైలు)
మధ్య:
ఐసిఐసిఐ లాంబోర్డ్ జెనరల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ మరియు ఇతరులు
...అప్పిలెంట్స్/అపోజిట్ పార్టీస్ నెం: 1 అండ్ 2
అండ్
వింజమూరి ఏడుకొండలు మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్ / కంప్లైనెంట్ / అపోజిట్ పార్టీ నెం.3

నోటీసు

టు:
రెస్పాండెంట్/అపోజిట్ పార్టీ నెం.1: వింజమూరి ఏడుకొండలు, తండ్రి: నీలాద్రి, నివాసం: డోర్ నెం: 1-48, చర్చి వీధి, తిరుపతిపురం గ్రామం, అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
పై నెంబరు ఎఫ్.ఎలో రెస్పాండెంట్/అపోజిట్ పార్టీ నెం.3 అయిన మీకు పై స్టేట్ కమిషన్/శ్రీకోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను నోటీసులు పంపినను మీకు ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసిందిగా పై కోర్టు/స్టేట్‌కమిషన్ వారు ఆర్డరు వేస్తూ ది. 11-11-2024 వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ లేదా మీ అడ్వకేటు ద్వారా గాని పై కమిషన్ వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు అప్పీలును మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం) వాయిదా తేదీ: 11-11-2024
సం/- **యు.అవినాష్**
అప్పిలెంట్/అపోజిట్ పార్టీస్ తరపు న్యాయవాది
విజయవాడ, సెల్: 77298 09921

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వివరాలు

ఆన్ లైన్ పనులు వేగవంతం చేయాలి : జేసీ

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘాల వివరాలు కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్, జిల్లా సహకార బ్యాంకు ఛైర్మన్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వివరాలు కంప్యూటరీకరణ పనుల పురోగతిపై శనివారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సహకార, జిల్లా సహకార బ్యాంకు మేనేజర్లు సూపర్వైజర్లతో జేసీ రాహుల్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలోని బ్యాంక్ ఖాతాలు, రైతుల వివరాలు అన్ని ఆన్ లైన్ పొందుపరచాలన్నారు. ఈ పను లకు సంబంధించి తొలిదశలో భాగంగా డీసీపీ(డేటా క్యాప్చ రింగ్ పార్ట్) వివరాలను నాలు గు రోజుల్లో పూర్తి చేయాలని జేసీ అధికారులకు స్పష్టం చేశారు. కేవైసీ వివరాలు దొరకని రైతులు వివరాలను బ్యాం కు మేనేజర్లు, సూపర్వైజర్లు ప్రత్యేక దృష్టి పెట్టి అక్టోబర్ చివరి నాటికి ఆన్ లైన్లో నమోదు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో ఆర్ నరసింహరావు, డీజీఎం ప్రవీణ్ కుమార్, డీసీవో జీ వెంకట కృష్ణ, డిప్యూటీ కోపరేటివ్ అధికారి బి దుర్గాప్రసాద్, వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకు మేనేజర్లు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

భూ రీసర్వే సదస్సుల్లో తొమ్మిది అర్జీలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం పాతర్లగడ్డ గ్రామంలో సర్వే సదస్సులో తొమ్మిది అర్జీలు అందాయని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. భూముల వివరాలు సక్రమంగా లేకపోయినా సర్వేలో లోపాలు ఉన్న వాటన్నిటిని సరిచేసేందుకు ఈ సదస్సులు ఎంతగానో రైతులకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎల్ఓ, డిప్యూటీ ఇన్స్పెక్టర్, ఆర్ఐ, వీఆర్వో కిషోర్, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, జనసేన గ్రామకమిటీ అధ్యక్షులు బండారు లక్ష్మణ్ ప్రసాద్, సర్వేయర్లు, పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై 22, 23 తేదీల్లో 32 గంటల నిరసన దీక్షలు

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: అధ్వాన్న స్థితికి చేరుకున్న కైకలూరు, నాగిడిపాలెం, గణపవరం, తణుకు నుంచి జిల్లా కేంద్రం భీమవరం చేరుకునే రోడ్ల నిర్మాణం తక్షణమే చేపట్టాలని కోరుతూ ఈ నెల 22, 23వ తేదీల్లో భీమవరంలో సిపిఐ చేపట్టిన 32 గంటల నిరసన దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన భీమవరంలో ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ఈ దీక్షలను 22వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రకాశంచౌక్ సెంటర్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రారంభిస్తారని, 23వ తేదీ సాయంత్రం 5 గంటలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ దీక్షలను విరమింపచేస్తారని తెలిపారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రోడ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురయి ప్రమాదాలకు నిలయాలుగా మారాయన్నారు. రోడ్లపై ప్రయాణం అత్యంత కష్టతరంగా,ప్రమాదకరంగా మారిందన్నారు. రోడ్లపై ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల్లో వాహనాలు పడి వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురై తీవ్ర అంగ వైకల్యానికి గురవుతున్న సంఘటనలు నిత్యకృత్యంగా మారాయని కోనాల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితి గత వైసీపీ పాలన నిర్లక్ష్య ఫలితమే నన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించి తక్షణమే రోడ్ల నిర్మాణం చేపట్టి వాహనదారులు, ప్రజల కష్టాలను పరిష్కరించాలని కోరారు.అధ్వాన్న స్థితికి చేరుకున్న రోడ్ల నిర్మాణం కోరుతూ సీపీఐ చేపట్టిన 32 గంటల నిరసన దీక్షలను జయప్రదం చేయాలని కోనాల కోరారు.

బిపిఎల్ కార్డుదారులకు చౌకగా వంట నూనెలు

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలోని రైస్ కార్డుదారులందరూ వంటనూనెలను కొనుగోలు చేయుటకు విధిగా రైస్ కార్డు నెంబరు, మొబైల్ నెంబరు వివరములను తెలియచేసి, క్యూఆర్ కోడును స్కాన్ చేసి, ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ధరలకే వంట నూనెలు పొందవచ్చుని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎన్.సరోజ తెలిపారు. శనివారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ కార్డుదారుని మొబైల్కు వచ్చిన ఒటిపి వివరాలు తెలియచేసి నెలకు మూడు పామాయిల్ ప్యాకెట్స్ 850 గ్రాములు రూ. 110 ఒక ప్యాకెట్టు చొప్పున, సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్టు 910 గ్రాములు రూ. 124 ఒక ప్యాకెట్టు చొప్పున పొందవచ్చన్నారు. జిల్లాలోని మూడు రైతు బజార్లు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో, పద్నాలుగు డీమార్ట్, రిలయన్సు, విజేత, విక్టరీ బజార్ మొదలైన బిగ్ చైన్ రిటైలర్స్ ద్వారా విక్రయించుటకు అందుబాటులో ఉంచామన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్లో ఐజీ తనిఖీ

విశాలాంధ్ర - నరసాపురం : నర్సాపురం రూరల్ పోలీస్ స్టేషన్ను డీఐజీ అశోక్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ను సందర్శించినట్లు తెలిపారు. స్టేషన్లో రికార్డులన్నీ పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ తనిఖీలలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, రూరల్ ఎస్సై పాల్గొన్నారు. సబ్ డివిజనల సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.

మురళి కృష్ణంరాజుకు అభినందనలు

విశాలాంధ్ర / ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం చెందిన మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదునూరి మురళీకృష్ణ రాజు ఇటీవల వైసిపి పార్టీలో చేరిన సందర్భంగా గజ్జనపూడి, పోతులూరు, వెంకటనగరం, యూజెపురం గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయ కులు, కార్య కర్తలు భారీ స్థాయిలో నియోజవర్గం నుండి తరలివచ్చి మురళి కృష్ణం రాజును మర్యాద పూర్వకంగా కలిసి బొకేలు, సాలువాలు, పూల దండ లతో, సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గజ్జన పూడి సర్పంచ్ అప్పలరాజు, సత్తిబాబు, అనకాపల్లి నూకరాజు, చంద్రద అర్జునుడు, ఆవాల తాతబ్బాయి, సూరిబాబు, శెట్టి సత్తిబాబు, ముప్పిడి ఏసుబాబు, బర్ల గోవింద్, రేఖ కృష్ణఅర్జున్, రేఖ బాబూరావు, అప్పారావు, అవ్వ ఆదినారాయణ, చక్కపల్లి నాగేశ్వరరావు, ఒట్టికళ్ళ నూకరాజు, ముప్పిడి నూకరాజు, తదితరులు అభినందనలు తెలియజేశారు.

రి సర్వే గ్రామసభలో 16 అర్జీలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని జిల్లా కల్కటర్ వారి ఆదేశాల మేరకు, తహశీల్దార్ ఆత్రేయపురం వారి ఆధ్వర్యంలో ఆత్రేయపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సదస్సు కార్యక్రమంలో తహసీల్దార్ వారు డివిజనల్ సర్వే అధికారి, ఏఎస్ఓ అత్రేయపురం, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు. ఈ గ్రామ సభలో రి సర్వే విషయమై 16 అర్జీలు నమోదు కాగా సదరు అర్జీలను పరిష్కరించుటకు 15 రోజులు నిర్దీత గడువు నిర్దేశించారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - అనపర్తి : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియే షన్ అనపర్తి యూనిట్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శని వారం అసోసియేషన్ భవనంలో రాజమహేంద్రవరానికి చెందిన రమా డెంటల్ వైద్యులు అమర్ దంత పరీక్షలు, డాక్టర్ మోహన్స్ డయా బెటిస్ ఆస్పత్రి వైద్యులు దుర్గాప్రసాద్ షుగర్ వ్యాధి రక్త పరీక్షలు, డాక్టర్ అగ ర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు ఎస్ విజయ, హరిబాబు కంటి పరీక్షలు నిర్వ హించారు. పి వి ఎన్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా వైద్యులు వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిం చారు. అనంతరం బ్లూ చిప్స్ ఇన్వెస్ట్మెంట్ మార్కెటింగ్ మేనేజర్ సుబ్బారావు పెట్టుబడులు, ఇన్కమ్ టాక్స్ మినహాయింపులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం కృష్ణారెడ్డి, ఎం వి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్

విశాలాంధ్ర - యానాం : యానాం నియోజకవర్గం పరిధిలో గంజాయిని విక్రయిస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు. శనివారం ఈ ఘటనకు సంబంధించి వివరాలను విలేకరుల సమావేశంలో తెలియజేశారు. స్థానిక రీజెన్సీ స్కూలుకు వెళ్లే దారి పరిసర ప్రాంతంలో నలుగురు యువకులు గంజాయిని విక్రయిస్తుండగా క్రైమ్ టీం దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యానాం ఫెర్రీ రోడ్డుకు చెందిన సంగాడి మహేష్ బాబు, తాళ్లరేవు మండలం సీతారామపురం కు చెందిన గెద్దం రాజు, అయ్యన్న నగరకు చెందిన పెసంగి నాని, పినపోతు విజయదుర్గ వరప్రసాద్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను యానాం సబ్ కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని తెలిపారు. నిందితులు నలుగురు 21 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు వారు కావడం విశేషం. ఈ సమావేశంలో సిఐ షణ్ముగం, జె ఎస్ఐ మురుగనందం, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - అమలాపురం : చిక్కం సత్తిరాజు అన్నదాన సత్రం ఉప్పలగుప్తం వ్యవస్థాపకులు చిక్కం సత్తిరాజు(సత్రరాజు)వర్ధంతి సందర్భంగా శనివారం సిఎస్ఎం అండ్ ఎంఎస్ఎస్ కళాశాల ఆవరణలో సత్తిరాజు కాంస్య విగ్రహమునకు పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చిక్కం వీర వెంకటసత్యవరప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పోత్తూరు వెంకటపతి రాజు, కోశాధికారి మోటూరి సుబ్రహ్మణ్యం, పాలకవర్గం కార్యవర్గ సభ్యులు ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ మరియు కుటుంబ అనువంశికులైన చిక్కుం గోపాలకృష్ణ, చిక్కం పద్మనాభం, చిక్కుం బాలసుబ్రమణ్యం, చిక్కం సూర్యనారాయణమూర్తి, చిక్కుం సత్తిరాజు. చిక్కం రాజేంద్రప్రసాద్, చిక్కుం నాగేశ్వరరావు, చిక్కం విశ్వనాథం మరియు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టిడి ఈశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని 200 మంది నిరుపేదలకు వస్త్రాలు, బియ్యం తదితర వస్తువులు అందజేశారని తెలిపారు.

భేటీ బచావో - బేటి పడావో కార్యక్రమం

విశాలాంధ్ర - కొవ్వూరు : సమాజంలో ఆడపిల్లలపై వివక్ష , దాడులు అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయని ఆడపిల్లలపై వివక్షత మాని ఆడపిల్లలను రక్షించుకొని ఆడపిల్లలను చదివించడం బాధ్యతగా తీసుకోవాలని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు వెంకటేశ్వరరావు అన్నారు. ఆడపిల్లల సంరక్షణకై కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కొవ్వూరు పట్టణంలోని లిటరరీక్లబ్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ నాయకులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కొవ్వూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాయన రామకృష్ణ, కొవ్వూరు మండల పరిషత్ అధ్యక్షులు నారాయుడు, కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు శివరామకృష్ణ, జనసేన ఇన్చార్జ్ టీవీ రామారావు, భారతీయ జనతా పార్టీ నాయకులు ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, తాడిమల్ల విజయ వాణి, గోపు శెట్టి భువనేశ్వరి, శివకృష్ణ, గంట్రోతు పవన్, కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, పాల్గొన్నారు